సాక్షి ఖమ్మం

సోమవారం ı 30 ı సెప్టెంబర్ ı 2024



లష్కర్లు ఏరీ..?

సాగు భూములకు కాల్వల నీరందించే లష్కర్ల కొరతతో జిల్లాలోని రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఐదు జిల్లాల స్థాయి అటవీ ఉద్యోగుల క్రీడా పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 8లో

గరిష్ఠం / కనిష్ఠం

33° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ మొదలవుతుంది. మధ్యాహ్నానికి తీవ్రత పెరిగి సాయంత్రం వరకూ కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

వైద్యాధికారి నియామకానికి 2న ఇంటర్వ్యూలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యాధికారి నియామకానికి వచ్చేనెల 2న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తి చేయడమే కాక తెలంగాణ మెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకుని 44ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. రిజర్వేషన్ ఉన్న వారికి మినహాయింపులు ఉంటాయని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకం చేపడుతుండగా, ఎంపికైన వారికి రూ.58,500 పారితోషికం ఇస్తామని వెల్లడించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు బయోడేటా, సర్టిఫికెట్లతో అక్టోబర్ 2న ఉదయం 10గంటలకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

పీఆర్ మినిస్టీరియల్ కమిటీ ఏకగ్రీవం



ఎన్నికల సందర్భంగా మాట్లాడుతున్న రాష్ట్ర ప్రతినిధులు

ఖమ్మంవన్‌టౌన్: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామునూరి రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వీవీఎస్ఎన్ గుప్తా, రాష్ట్ర కౌన్సిలర్‌గా జి. రవీంద్ర, షేక్ మీరా, మోరం మధుకుమార్, పి మధుకర్, సహ అధ్యక్షుడిగా గొల్లాడి శ్రీనివాస్‌రావు, జేసీసీ సభ్యుడిగా బండి భాస్కర్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ వాణిశ్రీ, టి. చెంపల్‌రాజు, కోటేశ్వరరావు, జీవన్ రెడ్డి, కోశాధికారిగా శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా రవికుమార్, ఎండీ ఆసిఫ్, టి.శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జానీమియా, ప్రమీల రాణి, భారతి, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మోదుగు వేలాద్రి వ్యవహరించగా రాష్ట్ర పరిశీలకులుగా మల్లవరపు రాజేష్, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నందకుమార్, అనంత్, నడింపల్లి వెంకటపతిరాజు, మల్లెల రవీంద్ర ప్రసాద్ హాజరయ్యారు.

పీఎం స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్ : 2024 – 25 విద్యా సంవత్సర పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు నూతన విధి విధానాలు విడుదలయ్యాయని, వాటి ప్రకారం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఇ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సెస్సీ మెమో, విద్యార్థి ఆధార్‌కార్డులో సమాచారం ఒకే విధంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల కుటుంబ ఆదాయ పరిమితి పట్టణాల్లో రూ.2.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థి మార్కుల మెమో, ఆధార్ వివరాలతో ఇ-పాస్‌లో దరఖాస్తు చేసుకుంటే 12 అంకెల ఈ-పాస్ ఐడీ వస్తుందని, సర్టిఫికెట్లలో వివరాలు సరిపోలకపోతే ఆధార్ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఈ-పాస్ ఐడీ వచ్చిన తర్వాత మీసేవా కేంద్రంలో బయోమెట్రిక్ వేయాలని తెలిపారు. అనంతరం ఈ-పాస్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి, సంబంధిత ధృవపత్రాలు జతపర్చి సంబంధిత కళాశాలలో సమర్పించాలని సూచించారు.

అలరించిన 'గువ్వా గోరింకతో'..



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రముఖ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గువ్వా గోరింకతో సాంస్కృతిక కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కమెడియన్, యాంకర్ మొగిలి గుణకర్, భక్తి గీతాల గాయకులు నాగసాయి, కొదుమూరి రమేష్‌బాబు, కొండపల్లి మురళీకృష్ణ సారథ్యంలో గాయనీ గాయకులు పాటలు పాడి అందరినీ ఆకట్టుకున్నారు. వీవీ రెడ్డి, రమణ, గణపతిరాజు, పున్నయ్య, మాలతీనాయుడు కీర్తన, స్వప్న, కీర్తి తదితరులు పాటలు పాడగా.. మొగిలి గుణకర్ కామెడీ కడుపుబ్బ నవ్వించింది.

ఆక్రమణలపై నజర్

ఇటీవలి వర్షాలతో నీటమునిగిన కవిరాజ్ నగర్ కాలనీ (ఫైల్)



ఖమ్మం నగరంలోని చెరువుల కబ్జాపై కార్పొరేషన్ టాస్క్

- మూడు చెరువుల పరిధిలో నాలాల మ్యాప్‌లు సేకరణ
- జిల్లా నీటి పారుదల శాఖ అధికారికి కమిషనర్ లేఖ
- ఆక్రమణలు తేలితే.. ఏ అనుమతులున్నా ఇక కూల్చివేతే

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో చెరువుల కబ్జాపై అధికారుల అడుగులు ముందుకు పడ్డాయి. నగరంలోని మూడు గొలుసుకట్టు చెరువులు ఏ మేరకు ఆక్రమణకు గురయ్యాయో తేల్చేందుకు కార్పొరేషన్ యంత్రాంగం కదిలింది. నగరంలోని ఖానాపురం ఊరచెరువు, లకారం, ధంసలాపురం చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాల మ్యాప్‌లు, వాటి ప్రస్తుత పరిస్థితిపై వివరాలు ఇవ్వాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య జిల్లా నీటిపారుదల శాఖ అధికారికి లేఖ రాశారు. దీని ఆధారంగా ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయని కార్పొరేషన్, నీటి పారుదల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. ఆక్రమణలు తేలితే.. ఏ అనుమతులున్నా కూల్చివేస్తారు. ఇటీవలి మున్నేరు వరదలు నగరంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తాయి. భారీ వర్షంతో పాటు ఈ చెరువుల వరదతో నగరంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. చెరువుల ఆక్రమణ, నాలాలకు అడ్డంగా భవనాల నిర్మాణంతో వరద అతలాకుతలం చేసింది. ఈ పరిస్థితితో భవిష్యత్‌లో వరద ముంచెత్తకుండా ఆక్రమణలపై కేఎంసీ అధికారులు దృష్టి పెట్టారు.

నాలాల మూతతోనే..

నగరంలోని ఖానాపురం ఊరచెరువు, లకారం, ధంసలాపురం చెరువులు గొలుసుకట్టువి కావడంతో నాలాలు ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా ఈ చెరువుల పరిధిలోని బఫర్‌జోన్, నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో ఇటీవల వచ్చిన వరదలకు నగరంలోని 10, 11 డివిజన్లలో పలు కాలనీలు నీట మునిగాయి. నాలాల ఆక్రమణతో నీరు వెళ్లే మార్గం లేక కాలనీల్లోకి వరద వచ్చింది. ఈ మూడు చెరువుల మధ్య వరద కాల్వల పరిమాణం తగ్గిపోయింది. ఈ కాల్వ లను ఆనుకుని నిర్మాణాలు వెలిశాయి. ఖానాపురం, ప్రశాంతినగర్, చైతన్యనగర్, కవిరాజ్‌నగర్ ప్రాంతాల్లో ఎక్కువ నిర్మాణాలు ఉన్నాయి. వరద ఎక్కువగా వచ్చిన సమయంలో చెరువు అలుగు పడితే మరో చెరువులోకి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన కాల్వలు కుచించుకుపోవడంతో నీరు పోటెత్తుతోంది.

ఆనవాళ్లు లేని కాలువలు..

ఎన్నెస్పీ ఖమ్మం మేజర్-1 పంట కాల్వ పరిధిలోని ఆయకట్టు మొత్తం రియల్ ఎస్టేట్‌గా మారింది. పంట కాల్వను కూడా కొందరు ఆక్రమించారు. వెంచర్లలోకి వెళ్లిన ప్రాంతంలో కాల్వ మీదనే రోడ్లు వేశారు. మధురానగర్, వరదయ్యనగర్, గొల్లగూడెం ప్రాంతాల్లో కొంత భాగంలో పార్కులు ఏర్పాటు చేశారు. ఎగువ నుంచి వచ్చే వరద లకారం చెరువులోకి వెళ్లేందుకు తవ్విన కాల్వలు ఆక్రమణలకు గురి కావడంతో అధికారులు ఇందిరానగర్ కాలనీలో జేసీబీలతో కాల్వను వెడల్పు చేశారు. అడ్డుగా ఉన్న గోడను పడగొట్టారు. అలాగే 11వ డివిజన్‌లోని ఖానాపురం అలుగువాగులో నిర్మించిన ఐస్ ఫ్యాక్టరీని కూడా నేలమట్టం చేశారు.

ఇక వరద ముంచకుండా ..

మూడు చెరువుల ఎఫ్‌టీఎల్, కాలువల వివరాలను ఇరిగేషన్ అధికారులు మ్యాప్‌లతో సహా కార్పొరేషన్‌కు అందించాలి. ఈ సర్వే నంబర్లు.. ఆక్రమించిన సర్వే నంబర్లన్నీ నివేదికలో పొందుపర్చాలి. దీని ఆధారంగా కార్పొరేషన్, నీటి పారుదల శాఖ అధికారులు తనిఖీ చేసి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటారు. ఆక్రమించిన వాటికి ఏ అనుమతులున్నా కూల్చివేయనున్నట్లు తెలుస్తోంది.

మ్యాప్‌లను సేకరిస్తున్నాం..



ఖమ్మం నగరంలోని చెరువుల బఫర్‌జోన్, నాలాల మ్యాప్‌లను సేకరిస్తున్నాం. వీటి పూర్తి వివరాలు, మ్యాప్‌లు అందించాలని ఇరిగేషన్ అధికారులకు లేఖ రాశాం. ఆ వివరాలు, మ్యాప్‌లకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నాలాలను పరిశీలించి ఆక్రమణలను గుర్తిస్తాం. నాలాల వెంట ఇళ్లు నిర్మించిన వారి వద్ద ఉన్న ఆధారాలను తెలుసుకునేందుకు నోటీసులు అందజేస్తాం. ఎక్కడైనా అక్రమంగా నిర్మించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్

బఫర్.. ఎఫ్‌టీఎల్ హాంఫట్..

ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారికి సమీపంలో ఖానాపురం ఊర చెరువు ఉంది. ఈ చెరువు సర్వే నంబర్ 13లో 74 ఎకరాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో 24 ఎకరాలు.. మొత్తం 98 ఎకరాల్లో ఉంది. గతంలో ఈ చెరువు ద్వారా 200 ఎకరాలకు సాగునీరు అందేది. ప్రస్తుతం ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారు. బఫర్‌జోన్‌లో 38 ఇళ్లు నిర్మించారు. వీటిలో పదింటికి ప్రభుత్వం పట్టాలు కూడా మంజూరు చేసింది. మూడు ఇళ్లను అధికారులు కూల్చివేశారు. గత మూడేళ్ల నుంచి ఈ చెరువు ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను పూడుస్తున్నారు.

ఎఫ్‌టీఎల్‌లోనే వెంచర్..

సర్వే నంబర్ 178లో ధంసలాపురం చెరువు శిఖం 128.14 ఎకరాలు, 142 ఎకరాలు ఎఫ్‌టీఎల్ ఉంది. గతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలోని 10 ఎకరాల్లో వెంచర్ వేశారు. అలాగే మరో రెండు ప్లాట్లల్లో మట్టి తోలి ఎత్తుపెంచారు. ఒక ప్లాట్‌కు ప్రహరీ నిర్మించారు. ఈ చెరువుకు కూడా ఎక్కడా ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. రూ.కోట్ల విలువ చేసే చెరువు కబ్జా అవుతున్నా.. ఫెన్సింగ్ వేయలేదు.

తూములు, కాలువలు పూడ్చి..

లకారం చెరువు 163 ఎకరాల్లో విస్తరించింది. దీని పరిధిలో గతంలో 126 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే నగరం అభివృద్ధి చెందడంతో ఈ భూములన్నీ నివాస ప్రాంతాలుగా మారాయి. 2014–15లో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయలో భాగంగా 150 ఇళ్లను తొలగించింది. ఆక్రమణల నుంచి చెరువును రక్షించేందుకు పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దింది. లకారం ట్యాంక్‌బండ్, మంచినీటి ప్రాజెక్టు రిజర్వాయర్‌లు 134 ఎకరాల్లో ఉన్నాయి. అయితే లకారం చెరువుకు నీళ్లు వచ్చే కాలువ, తూము కాల్వలను కూడా పూడ్చి కబ్జా చేస్తున్నారు.

ప్రయాణం.. ప్రయాసే..



నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఖమ్మం రైల్వేస్టేషన్

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు తప్పని ఇక్కట్లు

- పండుగ వేళ పలు రైళ్ల రద్దు, కొన్నింటి దారి మళ్లింపు
- దసరా ప్రయాణాలకు ఆర్టీసీ బస్సులే ఆధారం
- సర్వీసుల సంఖ్య పెంచాలని కోరుతున్న ప్రయాణికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉత్తర తెలంగాణకు ప్రధాన కేంద్రంగా ఉన్న వరంగల్ మీదుగా వెళ్లే పలురైళ్లను రద్దు చేయడంతోపాటు మరికొన్నింటిని దారి మళ్లించారు. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజలకు దసరా సెలవుల్లో ప్రయాణం కష్టంగా మారనుంది. చెన్నై–న్యూఢిల్లీ గ్రాండ్‌ట్రంక్ సెక్షన్‌లో కీలకంగా ఉన్న కాజీపేట జంక్షన్–వరంగల్‌ల మధ్య రైలు మార్గాన్ని విస్తరిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో పగటి వేళ ప్రయాణించే ప్రధాన రైళ్లను సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 7 వరకు రద్దు చేశారు. కొన్ని దూర ప్రాంత రైళ్లను విజయవాడ–గుంటూరు–నల్లగొండ–పగిడిపల్లి మీదుగా దారి మళ్లించారు. ఫలితంగా కాజీపేట–విజయవాడ మార్గంలో ఖమ్మం, మధిరల మీదుగా వెళ్లే రైళ్ల రాకపోకలు లేకుండాపోయాయి. దీంతో ఇటు వరంగల్, హైదరాబాద్ అటూ విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల వైపు రైలు ప్రయాణం కష్టంగా మారింది. ముఖ్యంగా ఖమ్మం, మధిర, ఎర్రుపాలెం, బోనకల్ స్టేషన్ల నుంచి నిత్యం వేలాది మంది విజయవాడకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ పండుగవేళ సులభమైన ప్రయాణ సౌలభ్యం దూరమైంది.

దసరా సెలవులు రావడంతో..

తెలంగాణలో దసరా సెలవులను అక్టోబరు 2 నుంచి 14 వరకు ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తర తెలంగాణలో దసరా పండుగను ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా పల్లె, పట్నం తేడా లేకుండా బతుకమ్మ ఆటలు ఆడుతారు. దీంతో పండగల సందర్భంగా సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు కుటుంబ సమేతంగా ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయి. సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 7 వరకు వరంగల్, కాజీపేటల మీదుగా పగటి వేళ నడిచే సింగరేణి, కాకతీయ, గోల్కొండ, శాతవాహన వంటి అనేక రైళ్లు రద్దయ్యాయి. దీంతో సింగరేణి ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలకు ప్రధాన రవాణా సదుపాయం దూరమైనట్లయింది.

ఇక ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరకని ప్రయాణమే..

పండుగ సెలవుల ఆరంభంలో రైళ్లు రద్దు కావడంతో ఆర్టీసీ బస్సులే ప్రయాణానికి అందుబాటులో ఉండనున్నాయి. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కారణంగా సాధారణ రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో సీట్లు దొరకడం కష్టంగా మారింది. ఇక దసరా వంటి పెద్ద పండుగలు వరుసగా పది రోజులకు మించి విద్యాసంస్థలకు సెలవులు వచ్చినప్పుడు ఈ రద్దీ మరింత పెరగనుంది. సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలో రాకపోకలకు ప్రజలు మరింత ఇబ్బంది పడేందుకు ఆస్కారం ఉంది. కొత్తగూడెం నుంచి గోదావరిఖని వరకు కేవలం పదిలోపే బస్సులు అందుబాటులో ఉన్నాయి. అవి కూడా ప్రధానంగా రాత్రి వేళనే నడుస్తున్నాయి. పగటి వేళ వెళ్లాలంటే వరంగల్/హన్మకొండకు చేరుకుని అక్కడి నుంచి మంచిర్యాల, గోదావరిఖనిలకు వెళ్లాల్సి ఉంటుంది. రైళ్ల రద్దును దృష్టిలో ఉంచుకుని సర్వీసుల సంఖ్య పెంచేలా ఆర్టీసీ కసరత్తు చేయాల్సిన అవసరం ఉంది.

దారి మళ్లించిన కొన్ని ప్రధాన రైళ్లు

కాకినాడ – షిర్డీ	విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి
ఈస్ట్‌కోస్ట్	విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి
కృష్ణా	విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి

ఈనెల 23 నుంచి వచ్చేనెల 8 వరకు రద్దయిన రైళ్ల వివరాలు

రైలు	రద్దయ్యే రోజులు
సింగరేణి	26 నుంచి 8 వరకు
కాకతీయ	25 నుంచి 7 వరకు
శాతవాహన	25 నుంచి 7 వరకు
గోల్కొండ	23 నుంచి 7 వరకు
ఇంటర్‌సిటీ	23 నుంచి 2 వరకు
అండమాన్	25 నుంచి 8 వరకు
భాగ్యనగర్	23 నుంచి 7 వరకు
రామగిరి	26 నుంచి 8 వరకు
కోచివెల్లి – గోరఖ్‌పూర్	సెప్టెంబర్ 26,30, అక్టోబర్ 2, 3, 7

క్రీడల్లో గెలుపోటములు సహజం

సీపీ సునీల్‌దత్



ట్రోఫీలు సాధించిన విజేతలతో సీపీ

ఖమ్మంక్రైం : ఆటల్లో గెలుపోటములు సహజమని సీపీ సునీల్‌దత్ అన్నారు. సిటీ పోలీస్ శిక్షణా కేంద్రం పరేడ్ మైదానంలో ట్రెయినీ కానిస్టేబుళ్లకు (సివిల్, ఏఆర్) రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ ముందుగా క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, పతకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడితే విజయం వరిస్తుందని అన్నారు. ఓడిపోయిన వారు సైతం నిరుత్సాహ పడొద్దని సూచించారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) నరేష్‌కుమార్, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏసీపీలు నర్సయ్య, రవి, సాంబరాజు, ఆర్‌ఐ అప్పలనాయుడు, నాగుల్ మీరా, సీఐలు హనుక్, రాజిరెడ్డి, రమేష్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్ : తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల అసోసియేషన్(టీఎస్ జీహెచ్ఎంఏ) సంఘం నూతన కమిటీని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాయల వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా దుగ్గినేని నాగేశ్వరరావు, కోశాధికారిగా దామాల పుల్లయ్య, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎ.శైల, ఆర్.వెంకట్రావు, జి.శ్రీనివాసరావు, సీహెచ్.సుధాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆర్.రాజ గంగారెడ్డి, గిరిధర్ వ్యవహరించగా.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, డీఈఓ సోమశేఖర శర్మలు హాజరయ్యారు.

రాష్ట్ర టీటీ టోర్నీలో రాణించిన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్ : రంగారెడ్డి జిల్లా కాప్రాలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగిన అండర్ -19 రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు జయకేతనం ఎగురవేశారు. బాలుర విభాగంలో పిట్టల మోహిత్ కృష్ణ (గోర్కి స్కూల్), బాలికల విభాగంలో టి.శ్రీఅమృత(హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్) సత్తా చాటారు. టీం ఈవెంట్‌కు జరిగిన ఈ పోటీల్లో సింగిల్స్ విభాగంలో పిట్టల మోహిత్ కృష్ణ ద్వితీయ స్థానంలో నిలవగా టి.అమృత తృతీయస్థానం దక్కించుకుని జాతీయ పోటీలకు ఎంపిక కావడం విశేషం. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించడం పట్ల జిల్లా అండర్–19 పాఠశాలల క్రీడల కార్యదర్శి ఎండీ.మూసాకలీం, టేబుల్ టెన్నిస్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి వీవీఎస్ మూర్తి హర్షం వ్యక్తం చేశారు.

'కాంట్రాక్ట్'తో కల సాకారం !

- తీరనున్న 2008 డీఎస్సీ అభ్యర్థుల కోరిక
- నేడు సర్టిఫికెట్ల పరిశీలన



ఖమ్మం సహకారనగర్ : ప్రభుత్వం ఉద్యోగం.. అందులోనూ ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో మందికి ఇష్టం. అలాంటి ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి చదవి.. పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినా ఇప్పటివరకూ కొలువు దక్కని పరిస్థితి 2008 డీఎస్సీ అభ్యర్థులది. వారి కల సాకారం చేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలోనైనా ఉద్యోగావకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇన్నాళ్లు వేచి చూసిన అభ్యర్థులకు ఊరట కలగనుంది.

ఉమ్మడి జిల్లాలో 343 మంది..

విద్యా వ్యవస్థను మెరుగుపరుస్తున్న క్రమంలో 2008 డీఎస్సీలో ఉత్తీర్ణులైన వారిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 343 మంది అభ్యర్థులు ఉండగా మైదాన ప్రాంతం వారు 128 మంది, ఏజెన్సీ అభ్యర్థులు 215 మంది ఉన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వీరిని నియమిస్తే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

జిల్లాలో ఎస్జీటీల కొరత..

జిల్లాలో 813 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, సుమారు 2,500 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియతో పలు పాఠశాలల్లో ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)ల కొరత ఏర్పడింది. ఇటీవల బదిలీ అయిన ఎస్జీటీలను కొత్త ప్రాంతాలకు వెళ్లేందుకు సైతం ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేయలేదంటే వారి కొరత ఏ మేరకు ఉందో తెలుసుకోవచ్చు.

ఐదు కౌంటర్ల ద్వారా పరిశీలన..

ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయంలో సోమవారం 2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఇందుకోసం ఐదు కౌంటర్లు ఏర్పాటుచేయగా.. ఒక్కో కౌంటర్‌కు ఒక హెచ్‌ఎం సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. డీఈఓ కార్యాలయ సిబ్బంది ప్రధానోపాధ్యాయులకు సహాయకులుగా ఉంటారు. ఇదిలా ఉండగా 343 మంది అభ్యర్థుల్లో 150 నుంచి 200 మంది మాత్రమే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అనేక సంవత్సరాలు కావడంతో కొందరు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడగా.. మరికొంత మంది వివిధ వృత్తులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఏర్పాట్లు పూర్తి చేశాం

2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు కూడా వెంట తీసుకుని రావాలి. సర్టిఫికెట్ల పరిశీలనకు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశాం. – సోమశేఖర శర్మ, డీఈఓ

క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి బాసట



చెక్కు అందజేస్తున్న పోలీస్ సిబ్బంది

కూసుమంచి/ఖమ్మంక్రైం: మండలంలోని రావిచెట్టుతండాకు చెందిన 2003 బ్యాచ్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బానోత్ కోటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో సివిల్, ఏఆర్ సిబ్బంది రూ.2.40 లక్షలు సేకరించి ఆదివారం మృతుడి భార్యకు చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ, గజేంద్ర, మల్లేశ్, శ్రీను, హరికృష్ణ, హుస్సేన్, విజయ్, రామయ్య, ఫకీరా పాల్గొన్నారు.

లీగల్ అడ్వైజర్‌గా వెంకటరత్నం



వెంకటరత్నం

రఘునాథపాలెం: రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ లీగల్ అడ్వైజర్‌గా రఘునాథపాలెం మండలంలోని మంచుకొండకు చెందిన తాళ్లపల్లి వెంకటరత్నం నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ నూతన కమిటీని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంఘానికి మంచుకొండ కాంప్లెక్స్ సీఆర్పీ తాళ్లపల్లి వెంకటరత్నంను లీగల్ అడ్వైజర్‌గా నియమించారు.

అక్టోబర్ 3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్: అక్టోబర్ 3న నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్–14, 16, 18, 20 కేటగిరీల్లో బాలబాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపికలకు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు వెంట తీసుకొని ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని, జిల్లా జట్టుకు ఎంపికైన వారు హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని సంఘం బాధ్యులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్ అహ్మద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

అమీర్ అలీఖాన్‌కు ఘన సన్మానం..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

ఖమ్మంవన్‌టౌన్: ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన అమీర్ అలీఖాన్‌ను ఆదివారం పార్టీ శ్రేణులు, నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ గౌస్, బీహెచ్ రబ్బానీ, మిక్కిలినేని నరేందర్, షేక్ అబ్దుల్ రషీద్, రాజుయాదవ్, చెన్నారావు, వాసిమ్, జహీర్, మహమూద్, పాషా, ముజాహిద్దీన్, ప్రతిభారెడ్డి, అంజనీకుమార్, నాగరాజు, వేణు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కామేపల్లి: యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ తిరుపతిరెడ్డి కథనం ప్రకారం.. పాతలింగాల క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఎస్‌ఐ సాయికుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా గోవింద్రాల గ్రామానికి చెందిన సభావత్ మల్సూర్, లకావత్ సుమన్ బైక్‌పై వెళ్తుండగా ఆపే ప్రయత్నం చేశారు. వారు పారిపోతుండగా పట్టుకొని విచారించగా ఈ నెల 26న రాత్రి అదే గ్రామానికి చెందిన ఆలోత్ భావ్‌సింగ్‌ను రాయి, కర్రతో కొట్టి చంపినట్లు తెలిపారు. భావ్‌సింగ్ కొద్ది రోజులుగా వీరి గురించి చెడుగా మాట్లాడుతుండటంతో చంపామని ఒప్పుకున్నారని, హత్యకు వినియోగించిన రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు.

పూరిల్లు దగ్ధం

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్‌తండా గ్రామంలో ధరావత్ లచ్చుకు చెందిన పూరిల్లు ఆదివారం దగ్ధమైంది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించి అందులోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈమేరకు గ్రామస్తులు ఇచ్చిన ఫైర్ స్టేషన్‌క సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని వ్యాపించిన మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

లష్కర్లు ఏరీ..?

సాగు నీటిని పంట పొలాలకు అందించే విషయంలో లష్కర్లదే కీలకపాత్ర. జిల్లాలో లష్కర్ల కొరత నెలకొంది. ఏడాదికి ఏడుగురు లష్కర్లు ఉద్యోగ విరమణ పొందుతుండగా.. కొత్త నియామకాల జాడా లేదు. అయితే ప్రస్తుతం కొత్తగా లష్కర్లు, జేఈలను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,800 మంది లష్కర్లను నియమించగా.. వారిలో జిల్లాకు ఎంతమందిని నియమిస్తారన్నది తేలాల్సి ఉంది. జిల్లాకు 352 మంది లష్కర్లు, హెల్పర్లు కావాల్సి ఉండగా.. కేవలం 132 మందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

– ఖమ్మంఅర్బన్



సాగర్ కాల్వ

వేధిస్తున్న లష్కర్ల కొరత

- నీటి పారుదల కాల్వల పర్యవేక్షణలో కీలకపాత్ర
- జిల్లాకు 220 మంది అవసరం
- రాష్ట్రవ్యాప్తంగా లష్కర్ల నియామకం చేపట్టిన ప్రభుత్వం
- జిల్లాకు ఎంతమందిని కేటాయిస్తారోనని ఎదురు చూపు

లష్కర్లు లేక ఇబ్బందులు..

గత కొన్నేళ్లుగా జల వనరులశాఖలో లష్కర్ల నియామకం చేపట్టకపోవడంతో పాటు గతంలో ఉన్న వారంతా పదవీ విరమణ పొందడంతో చాలా కాలంగా ఇంజనీర్లే పర్యవేక్షిస్తున్నారు. చెరువులు, సాగర్ కాల్వలు, ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టును బట్టి లష్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారు. నీటి పంపిణీ ప్రారంభం అయితే ఆయకట్టు మొత్తానికి సాగు నీరు సక్రమంగా అందించేలా నీటి పంపిణీలో హెచ్చుతగ్గులను పర్యవేక్షిస్తూ.. స్థానికంగా రైతులను సమన్వయం చేస్తూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేవారు. నీటి సరఫరా లేని సమయాన కట్టలు, కాల్వలపై ఉండే కంపచెట్లు తొలగింపు, ఎక్కడైనా కట్టలు బలహీన పడినా, బుంగలు పడే అవకాశం ఉంటే వారు గుర్తించి ఇంజనీర్ల దృష్టికి తీసుకొస్తే వాటిని సాగు సీజన్ ప్రారంభం కాక ముందే మరమ్మతులు చేసేవారు. కానీ వీరి కొరతతో ఇలాంటి వాటిని గుర్తించడంలో ఆలస్యం అవుతోంది.



పంట కాల్వ

132 మందితోనే విధులు..

జిల్లాలో సాగర్ ఆయకట్టు, చెరువులు, ప్రాజెక్టులు, లిఫ్ట్ పరిధిలో సీతారామ మినహాయించి సుమారు 5 లక్షల ఎకరాల సాగు అవసరం ఉంది. వాటి పరిధిలో ఇంజనీరింగ్ లెక్కలు ప్రకారం 250 మంది లష్కర్లు, 102 మంది హెల్పర్లు అవసరం ఉంది. ప్రస్తుతం వీఆర్‌ఏల నియామకం తర్వాత జిల్లాలో 74 మంది లష్కర్లు, 61 మంది హెల్పర్లు ఉన్నారు. గత ప్రభుత్వంలో నియమించబడిన వీఆర్‌ఏలు తిరిగి వారి మాతృ శాఖ రెవెన్యూకు వెళ్లిపోతే మళ్లీ సమస్య మరింత జఠిలమవుతుంది. ఆయకట్టు దామాషా ప్రకారం ప్రతీ 1,500 ఎకరాలకు ఒక లష్కర్, మెయిన్ కాల్వపై ప్రతీ 6 కిలోమీటర్లకు ఒక లష్కర్, రెగ్యులేటర్ల వద్ద ఇద్దరు చొప్పున పనిచేయాల్సి ఉంది.

జిల్లాకు ఎంతమందో..

ప్రభుత్వం గత గురువారం హైదరాబాద్‌లో కొత్తగా లష్కర్లు, జేఈలను నియమించి వారికి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు. ఈ నియామకంలో ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు, ఇతర ప్రాజెక్టులకు అనుగుణంగా అవసరం ఉన్న మేరకు నియమిస్తారా లేదా అని వేచిచూడాల్సిందే. రాష్ట్రంలో మొత్తం 1,800 మందిని నియమించగా.. వారిలో జిల్లాకు ప్రస్తుతం లెక్కల ప్రకారం 220 మంది అవసరం ఉంది. పూర్తిస్థాయిలో నియామకం చేపడితేనే నీటి సరఫరా మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది.

నియామకాలు చేపట్టి 15 ఏళ్లు..

గత 15 ఏళ్లుగా లష్కర్ల నియామకం చేపట్టకపోవడంతో సాగర్ కాల్వ పర్యవేక్షణ భారంగా మారుతోంది. రాష్ట్రంలో సాగర్ ఎడమ కాల్వ 180 కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉంది. అలాగే 6.50 లక్షల ఎకరాల మేరకు ఆయకట్టు ఉంది. ఇక లిఫ్టులపైన మరో 85వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. నాగార్జున సాగర్ కాల్వల గుండా నీటి సరఫరా సక్రమంగా జరగడంలో గతంలో లష్కర్లు కీలకమైన పాత్ర పోషించారు. వీరు కాల్వ కట్టలపై ఉండే చెట్లు నరకడం, గుంతలు పూడ్చడం, తలుపులు లేపడం.. దించడం, కాల్వలో చెత్త చెదారం లేకుండా చూడడం, మృతదేహాలు, జంతువుల కళేబరాలు తీసివేయడం, నీరు సరిగా పారేలా చూస్తారు. మొత్తంమీద నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా వీరు పర్యవేక్షిస్తారు. దీనివల్ల నీటి నష్టపోకుండా సాఫీగా దిగువను పారుతుంది.

ఇక జేఈలు 71 మందే..

జిల్లాలో జల వనరులశాఖలో మొత్తం 110 మంది జేఈలు అవసరం ఉంటే ప్రస్తుతం 71 మంది మాత్రమే పని చేస్తుండడంతో ఉన్న వారిపై అధిక పనిభారం పడుతోంది. డీఈలు 35 మందికి గాను 32 మంది పని చేస్తున్నారు. ముగ్గురు డీఈలు వస్తే జిల్లా అవసరం మేర ఉన్నట్లే అవుతుంది. వీటిపై ప్రభుత్వం ఎంతమేర నియామకం చేస్తారనేది వేచి చూడాల్సిందే.

బాల్యం.. బలహీనం..

- పోషణలోపం అధిగమిస్తేనే భావి పౌరులు
- నేటితో ముగియనున్న పోషణమాసం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

సత్తుపల్లిటౌన్: చిన్నారులు పోషకాహార లేమితో బాధపడుతూ బలహీనమవుతున్నారు. ఎత్తుకు తగిన బరువు లేకపోవటం.. బరువుకు తగిన ఎత్తు లేకపోవటం.. అతి తక్కువ లోపపోషణ వంటివి బాల్యంపై ప్రభావం చూపుతోంది. ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో పడి తల్లిదండ్రులు, పిల్లలకు సరైన పోషణ అందుతుందో లేదో కూడా పట్టించుకోలేక పోతున్నారు. దీంతో చిన్నారులు వయస్సు తగినట్లు పోషకాలు అందక బలహీనమవుతున్నారు. జిల్లాలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అతి తక్కువ బరువుతో 382 మంది చిన్నారులు, అతి తీవ్రలోప పోషణతో 237 మంది చిన్నారులు, తక్కువ తీవ్ర లోప పోషణతో 1,244 మంది చిన్నారులు, తక్కువ బరువుతో 3,242 మంది చిన్నారులు బాధపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్‌లో పోషణ్ అభియాన్ మాసంగా గుర్తించి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తోంది.

ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో ప్రత్యేక పోషణ..

అతి తీవ్రలోప పోషణ ఉన్న చిన్నారులను జిల్లా కేంద్రంలోని పిల్లల ఆరోగ్య పునరుజ్జీవ పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్‌ఆర్‌సీ)లో ప్రత్యేక పోషణ అందిస్తూ పోషక లోపాలను సరిదిద్దుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా లోపపోషణ పిల్లలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులతో చికిత్స అందిస్తున్నారు. వీరి సిఫార్స్ ఆధారంగా ఐదేళ్లలోపు బలహీనంగా ఉన్న చిన్నారులను ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో పోషకాహార వైద్య నిపుణుల సమక్షంలో చికిత్స ఇస్తున్నారు.

సరైన పోషణ అందకపోతే..

బాల్యంలో సరైన పోషణ అందకపోతే రక్తహీనత, విటమిన్‌లోపంతో కంటి సమస్యలు బాధిస్తాయి. రక్తహీనత వల్ల నీరసం, తరచూ జ్వరంతో బాధపడుతూ ఎముకల నొప్పులు, చిగుళ్లవాపులు వంటి సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో చిన్నారుల చదువుపై ప్రభావం పడుతోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

రోజూతినే భోజనంలో..

చిన్నారుల్లో రోజు భోజనంలో కూరగాయలు, గుడ్లు, పాలు, రాగిజావ, తాజా పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, డ్రైఫ్రూట్స్ అందించాలని ఐసీడీఎస్ ఆధ్వర్యాన తల్లులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన పెంపొందిస్తోంది. పిల్లలకు ఇచ్చే ఆహారంలో కార్బోహైడ్రేడ్స్ 60 శాతం, పిండి పదార్థాలు 10 శాతం, కొవ్వు 30 శాతం పదార్థాలతో పాటు పీచు పదార్థాలు, విటమిన్లు ఉండే ఆకుకూరలతో కూడిన సమతుల్య ఆహారం అందించాలని వైద్యులు సూచిస్తున్నారు. కొర్రలు, సామలు, రాగులు వంటి చిరుధాన్యాలను బాల్యం నుంచే తినే ఆహారంలో అలవాటు చేస్తే భావిపౌరుల్లో పోషణలోపం అధిగమించే అవకాశం ఉంటుంది.

ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా స్వామి



స్వామిరమేశ్‌కుమార్

ఖమ్మంలీగల్: ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది స్వామిరమేశ్‌కుమార్ ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. స్థానిక ఎమ్మెన్నార్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన ఫెడరేషన్ ఎక్స్‌ట్రార్డినరీ జనరల్ బాడీ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన నాలుగేళ్లు కొనసాగుతారు. కాగా, పలువురు న్యాయవాదులు ఆయన్ను అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. నేలకొండపల్లి నుంచి చెరువుమాధారం క్రాస్ రోడ్డు ద్వారా రాయగూడేనికి వెళ్లేందుకు చెరుకు రవి (23) బైక్‌పై వస్తున్నాడు. తిరుమలాపురం జాతీయ రహదారి అండర్‌పాస్ వద్దకు రాగానే కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రుడిని ఖమ్మం తరలించారు.

వురిమళ్ల ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం



సమ్మెట ఉమాదేవికి పురస్కారం అందిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: వురిమళ్ల ఫౌండేషన్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని మంచికంటిభవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కవులకు, రచయితలకు 'బోగోజు సముద్రమ్మ – పురుషోత్తం'స్మారక పురస్కారాలను అందించారు. వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయిత్రి సమ్మెట ఉమాదేవికి స్మారక పురస్కారాన్ని అందించి సత్కరించారు. జాతీయస్థాయిలో నిర్వహించిన వురిమళ్ల శ్రీరాములు స్మారక కథలు, వురిమళ్ల పద్మ స్మారక కవితల పోటీల్లో విజేతలగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందించి సన్మానించారు. ఈ సభలో పాల్గొన్న ప్రముఖ రచయిత శ్రీకంఠస్ఫూర్తి మాట్లాడుతూ.. వురిమళ్ల ఫౌండేషన్ ఏటా పోటీలను నిర్వహించి వార్షికోత్సవం సందర్భంగా పురస్కారాలు, నగదు బహుమతులు అందించటం అభినందనీయమన్నారు. కవులు మువ్వా శ్రీనివాసరావు, ప్రస్థానం ఎడిటర్ సత్యాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా వురిమళ్ల ఫౌండేషన్ రూపొందించిన కథలు, కవితల సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సంకలనాన్ని అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం సమీక్షించారు. కథల పోటీల్లో మొదటి బహుమతి ఎస్‌వీకే సంహితనాయుడు (హైదరాబాద్), ద్వితీయ బహుమతి కె.శ్రీనివాస్ (ఖమ్మం), ప్రోత్సాహక బహుమతులు సీతారామరాజు (కాకినాడ), కవితల పోటీల్లో మొదటి బహుమతి నాంపల్లి సుజాత (హైదరాబాద్), ద్వితీయ బహుమతి చిందం రమేశ్(జగిత్యాల) అందుకున్నారు. బాల రచయితలకు సర్టిఫికెట్లను అందించారు. కవులను సత్కరించారు. కార్యక్రమంలో వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోగోజు ఉపేందర్‌రావు, అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర, కవులు కపిల రాంకుమార్, పొత్తూరి సీతారామారావు, ఇబ్రహీం, నిర్గుణ్, రమణ, కోంద్రు బ్రహ్మం, కొమ్మవరపు కృష్ణయ్య, కన్నెకంటి వెంకటయ్య, ఫణిమాధవి, తాళ్లూరి రాధ, మద్దినేని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- అటవీ ఉద్యోగుల క్రీడలు షురూ..
- జోనల్ పరిధి నుంచి హాజరైన 650 మంది
- తొలిరోజు ఉత్సాహంగా కొనసాగిన పోటీలు
- పోటీలను ప్రారంభించిన సీసీఎఫ్ భీమానాయక్



క్రీడోత్సవాల ప్రారంభం సందర్భంగా బెలూన్లు ఎగురవేస్తున్న సీసీఎఫ్ భీమానాయక్ తదితరులు

చుంచుపల్లి: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఇందుకోసం రెండు ప్రాంగణాలను వినియోగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల నుంచి 650 మంది అటవీ ఉద్యోగులు హాజరు కాగా, అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు కబడ్డీ, షటిల్, రన్నింగ్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించగా, సీసీఎఫ్ భీమానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడితో ఉండే అటవీ ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణలో అటవీ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పారు. అప్పడప్పుడూ సిబ్బంది క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఆరోగ్యం పరిరక్షణకు తగిన వ్యాయామంతో పాటు ఆటలు ఆడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమయం దొరకినప్పుడల్లా మైదానాలకు వెళ్లి ఇష్టమైన ఆటలు ఆడాలని సూచించారు. ఈ రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడాంశాల్లో చురుగ్గా పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్ జిల్లాల అటవీ అధికారులు కిష్టాగౌడ్, సిద్ధార్థ విక్రమ్ సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అనూజ్ అగర్వాల్‌తో పాటు డీసీఎఫ్, ఎఫ్‌డీఓలు పి. క్రిష్ణమాచార్య, కె.దామోదర్ రెడ్డి, ఏసీఎఫ్, ఎఫ్‌డీఓలు ఎస్.సుజాత, సయ్యద్ మక్సూద్, బి.బాబు, వి.చంద్రశేఖర్, వి.మంజుల, యూ.కోటేశ్వరరావు, సందీప్‌రెడ్డి, భాగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ముగిసిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు



పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి ఎస్.నర్సింహమూర్తి, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్ అహ్మద్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్, సీనియర్ పీడీలు పీవీ రమణ, రామారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అండర్–17 బాలికల విభాగం 100 మీటర్ల విభాగంలో ఎ.మనుశ్రీ, మనస్విత, సీహెచ్ అక్షిత, కె.సౌమిత, 200 మీటర్ల పరుగులో ఎ.మనుశ్రీ, బి.మనస్విత, పి.మేదా, 400 మీటర్ల పరుగులో వి.వినిత, డి.సాగరిక, బి.కతిత, 800 మీటర్ల పరుగులో బిహానీ, కె.సంవిధ, డి.త్రిష, 1500 మీటర్ల పరుగులో ఎస్‌కే సానియా, డి.అభినయశ్రీ, ఎస్‌కే ఉజ్మ, 3 వేల మీటర్ల పరుగులో ఎన్.మేఘన, పి.సుచిత, ఎస్‌కే సానియా, అండర్–14 బాలురలో 100 మీటర్ల పరుగులో డి.సంతోష్, బి.నరేశ్, వి.చరణ్‌గౌడ్, 200 మీటర్లలో జి.కింగ్, వి.చరణ్‌గౌడ్, హెచ్.అభి, 400 మీటర్ల పరుగులో ఎ.మధుదీప్, ఐ.చరణ్, కె.విజయ్‌రామ్, 600 మీటర్ల పరుగులో కె.విజయ్‌రామ్, కె.గోపాల్‌కృష్ణ, ఎ.వరుణ్, షాట్‌పుట్‌లో బి.చందూలాల్, బి.నరేశ్, ఎస్.ఉమర్ ఫారుక్, లాంగ్‌జంప్‌లో హెచ్.అభి, వి.చరణ్‌గౌడ్, హెచ్.అఖిల్ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. బాలికల విభాగం 100 మీటర్ల పరుగులో బి.రుచిత జి.రాణి, కె.స్లామా, 200 మీటర్లలో బి.రుచిత, కె.హస్మిత, ఎం.భవిత, 400 మీటర్లలో ఎం.భవిత, బి.దీక్ష, ఎండీ అఫ్రీన్, 600 మీటర్లలో ఎస్‌కే సాల్‌మా మేతార్, ఎస్.మేరీ, పూజ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

బాలింతపై గుర్తు తెలియని వ్యక్తి దాడి

జూలూరుపాడు: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన జూలూరుపాడు మండలం మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ పెద్దతండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దతండాకు చెందిన బానోత్ నందిని తన రెండు నెలల చంటి బిడ్డతో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి భర్త భద్రం అలియాస్ పండు ఉన్నాడా? అంటూ అడుగుతూనే ఆమెపై స్టిక్‌రాడ్‌తో దాడి చేశాడు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అవుతుండడంతో ఆమె పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చేలోపే అక్కడ నుంచి దుండగుడు బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని కొత్తగూడెం వైపు పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ నందినిని స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే నందినితో భర్త భద్రం తరుచూ గొడవ పడుతుండేవాడని, పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. భద్రం మరో మహిళను పెళ్లి చేసుకుని ఆమె కూడా ఒకే ఇంట్లో అందరూ కలిసి ఉంటున్నారు. శనివారం ఉదయం నందిని భర్త భద్రం, అత్త సరోజలు ఇద్దరు కలిసి దుబ్బతండాలో బంధువు ఒకరు చనిపోతే అక్కడ వెళ్లగా, రెండో భార్య కొత్తగూడెంలోని ఓ షాపింగ్ మాల్ పని చేయడానికి వెళ్లింది. ఇంట్లో నందిని ఒంటరిగా ఉన్న సమయాన ఈ దాడి జరిగింది. మహిళ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి



మనస్విక (ఫైల్)

కొణిజర్ల: నీటి తొట్టిలో పడి చిన్నారి బాలిక మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతల వెంకటకృష్ణ, సమత దంపతులకు కుమారుడు తరుణ్‌సాగర్, కూతురు మనస్విక (13 నెలలు) ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు భోజనం చేస్తుండగా మనస్విని ఆడుకుంటూ బయటకు వచ్చింది. ఈ క్రమంలో ఇంటి బయట ఒక్క ఒరతో ఏర్పాటు చేసుకున్న చిన్న నీటి తొట్టి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడింది. అన్నం తిని చేయి కడుక్కోవడానికి తొట్టి వద్దకు వచ్చిన తాత కృష్ణయ్య నీళ్లలో పడి ఉన్న మనస్వికను చూసి కంగారుగా ఎత్తుకుని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. ఇటీవలే చిన్నారి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారి మృతితో కొణిజర్ల యాదవ బజార్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ...

మధిర: మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన కంపసాటి కొండ (32) హైదరాబాద్‌లో ఈ నెల 27న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాయపట్నం గ్రామానికి చెందిన రాజు, అచ్యుత్‌రావు చోరీ కేసుకు సంబంధించి జామీన్‌గా ఉండేందుకు కొండను హైదరాబాద్ తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీ సమీపంలో కొండ బహిర్భూమి కోసం వెళ్లి డ్రెయినేజీలో పడి మృతిచెందినట్లు అతడిని తీసుకెళ్లిన వ్యక్తులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య ఆశ మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుడు రాయపట్నంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఘటనపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాన్ని అచ్యుత్‌రావు ఇంటి ముందు పెట్టి ఆందోళన చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

నేలకొండపల్లి: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన అవిటి మారిబాబు (48) భార్య ఏడాది కిందట మృతిచెందింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మనోవేదనకు గురవుతున్నాడు. ఆదివారం గడ్డి మందు తాగి శంకరగిరితండా సమీపంలో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు స్థానిక పీహెచ్‌సీకి.. అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.